ప్రజాశక్తి

బుధవారం 28 జూన్ 2023

5

పార్వతీపురం మన్యం



అమ్మఒడితో రూ.108.85 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అమ్మఒడి పథకం నాలుగో విడత కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం కురుపాంలో జరిగే సమావేశంలో బటన్ నొక్కి అర్హత గల 83733మంది తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.13వేలు చొప్పున రూ.108.85 కోట్లు జమ చేయనున్నారు. జిల్లాలో మండలాల వారీగా తల్లుల సంఖ్య ఈ విధంగా ఉంది. బలిజిపేటలో 4864మంది, భామినిలో 4332, గరుగుబిల్లి 3439, గుమ్మలక్ష్మీపురం 5240, జియ్యమ్మవలస 4573, కొమరాడ 4800, కురుపాం 5114, మక్కువ 4769, పాచిపెంట 5320, పాలకొండ 5842, పార్వతీపురం 9369, సాలూరు 5947, సాలూరు రూరల్ 3952, సీతంపేట 6190, సీతానగరం 4656, వీరఘట్టం 5326 మందికి జమ కానుంది.

పరిష్కారం చూపేనా?

- నాన్ షెడ్యూల్ గ్రామాల్లో గిరిజనులకు అందని ఫలాలు
- ఏనుగుల దాడులు పట్టవా?
- సవర భాష సంగతేంటో?
- జంఝావతి, కొఠియా వివాదాలకు పరిష్కారమేది?
- జీడి, మామిడి రైతులకు భరోసా ఎక్కడ?
- పూర్ణపాడు - లాబేసు వంతెనకు ఇంకెన్నాళ్లు?
- డోలీ మోత తప్పేదెప్పటికి?
- జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాల కొరత తీరేనా?
- నేడు సిఎం జగన్ జిల్లా పర్యటన
- గంపెడు ఆశలతో మన్యం వాసులు



డోలీ సాయంతో రోగిని తీసుకెళ్తున్న గిరిజనులు (ఫైల్)

పార్వతీపురం మన్యం జిల్లాలో దీర్ఘకాలికంగా సమస్యలు పేరుకుపోయాయి. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతంగానే ఉండిపోయింది. ప్రత్యేక జిల్లాగా ఆవిర్భవించినప్పటికీ జిల్లా అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి మార్గాలు, సాగునీరు, రహదారులు, వంతెనల అభివృద్ధిలో వెనుకబాటు కొనసాగుతోంది. ముఖ్యంగా నాన్ షెడ్యూల్ గ్రామాల్లో గిరిజనులకు ప్రభుత్వ ఫలాలు అందడం లేదు. ఏనుగులు ఇప్పటి వరకు 17మందిని పొట్టన పెట్టుకున్నా వాటి నుంచి ముప్పు తప్పించేందుకు చర్యలు తీసుకోలేదు. ఈ ప్రాంత సవర బాష ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించలేదు. ప్రభుత్వాలు మారినా వాలంటీర్ల ఆవేదన అరణ్యరోధనగా మిగిలిపోయింది. జంఝావతి సాగునీటి ప్రాజెక్టుకు ఆటకంగావున్న ఒడిశా వివాదం పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధి చూపలేదు. కొఠియా గ్రామాల వివాదం పరిష్కారానికీ చొరవ లేదు. జీడి, మామిడి రైతులకు మార్కెట్ సదుపాయం, మద్ధ ధర కల్పించి భరోసా ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైంది. పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం తమ వల్లే సాధ్యమని చెప్పినా ఆచరణలో విఫలమైంది. తగినన్ని పిహెచ్‌సిలు, సబ్-సెంటర్లు కూడా లేకపోవడంతో నేటికీ డోలీ మోత తప్పడం లేదు. ఈనేపథ్యంలో కురుపాం వేదికగా అమ్మఒడి కార్యక్రమం ప్రారంభానికి వస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డిపై పార్వతీపురం జిల్లా వాసులు గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం, విజయనగరం ప్రతినిధి

అమ్మఒడి కార్యక్రమం ప్రారంభానికి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంకు తొలిసారిగా వస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఏజెన్సీలో దీర్ఘ కాలిక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఒడిశా ప్రాంతం లకేరి అడవుల నుంచి వచ్చిన అడవి ఏనుగుల గుంపు 16 ఏళ్లుగా మన్యం వాసుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే ఏనుగుల దాడిలో 17 మంది మృతిచెందారు. వేలాది ఎకరాల్లో పంటలను నాశనం చేశాయి. ఈనేపథ్యంలో ఎనుగుల నుంచి రక్షణ కల్పించాలని జిల్లా వాసులు గగ్గోలు పెడుతున్నా అతీగతీ లేకుండా పోయింది.

చాలా గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్ ఏరియాగా గుర్తించక పోవడంతో అక్కడి గిరిజనులు ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందలేక పోతున్నారు. సాలూరు, పాచిపెంట, మక్కువ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఎక్కువ నాన్ షెడ్యూల్ గ్రామాలు ఉన్నాయి.

ఏజెన్సీలోని జీవగెడ్డలపై మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యామ్‌లు నిర్మించడం ద్వారా సాగునీటి వనరులను పెంపొందించాలని స్థానికులు దశాబ్దాలు తరబడి కోరుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. దీంతో, నీరు వృథాగా పోతోంది. ముఖ్యంగా గుమ్మిడి గెడ్డపై రిజర్వాయర్ నిర్మిస్తే కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో 52గ్రామాల్లో ఉన్న 15వేల ఎకరాలకు సాగు నీరందుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సీమలగెడ్డ, వలస బల్లేరు గెడ్డ, డేకురాయి గెడ్డ, పనసభద్ర గెడ్డలపై చెక్ డ్యాములు నిర్మిస్తే వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. జిల్లాలోని వేలాది ఎకరాల్లో జీడి, మామిడి, బీడీఆకు పంటలు పండుతున్నాయి. ఈ పంటలకు మార్కెట్, మద్ధతు ధర కల్పించలేకపోతోంది.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా వైద్యం అందించే ఎఎన్ఎంలు లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తుంది. డోలీ మోత తప్పడం లేదు. సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 176 సవర భాష పాఠశాలలు ఉన్నాయి. వారి సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణమైన భాష ద్వారానే విద్యాబోధన చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోలేదు. గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటుకు ఐటిడిఎ అధికారులు చర్యలు చేపట్టినా పనులు మాత్రం ప్రారంభించలేదు. దీని నిర్మాణానికి రూ.35 లక్షల మంజూరైనా పనులు ప్రారంభించక పోవడంతో వెనక్కి వెళ్లిపోయాయి. ఈ ప్రాంతంలో గిరిజన అభ్యర్థులు ఉపాధ్యాయ శిక్షణకు విజయనగరం, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు.

కొమరాడ మండలం పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో, సుమారు 20 గ్రామాల ప్రజానీకం మండల కేంద్రానికి రావాలంటే సుమారు 30నుంచి 40కిలోమీటర్ల దూరం మేర ప్రయాణం చేయాల్సిన దుస్థితి కొనసాగుతోంది. గిరిజన యువత లో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు శిక్షణ కోసం క్రీడా పాఠశాలల ఏర్పాటు ప్రక్రియ నీరుగారింది. ఈ సిఎం పర్యటనలో ఈ సమస్య పరిష్కారమౌతాయా? అన్న ఆశతో జనం ఎదురు చూస్తున్నారు.



మన్యంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

రాగుల సాగు రెట్టింపు చేయాలి

చిరుధాన్యాల సాగు, ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్షలో మంత్రులు కారుమూరి, బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర్రావు, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. దీనిలో భాగంగానే రేషన్ డిపోల ద్వారా రాగులు, జొన్నలను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని చెప్పారు. చిరుధాన్యాలు, ధాన్యం సేకరణపై ఉత్తరాంధ్ర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాలు, విజిలెన్స్, తూనికలు కొలతలు, వ్యవసాయ శాఖాధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ముందుగా రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ ఎమ్‌డి వీరపాండ్యన్ మాట్లాడుతూ, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాల్సిన అవసరాన్ని, ప్రస్తుత పరిస్థితిని వివరించారు. తమ జిల్లాల్లోని చిరుధాన్యాలు ముఖ్యంగా రాగిపంట సాగు, దాని విస్తరణకు ఉన్న అవకాశాలను జాయింట్ కలెక్టర్లు పిపిటి ద్వారా వివరించారు. పంట విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అన్ని జిల్లాల్లో రాగుల సాగును రెట్టింపు చేయాలని అధికారులను మంత్రి కారుమూరి ఆదేశించారు. ప్రభుత్వం రాగులకు రూ.3,480 చొప్పున గిట్టుబాటు ధరను అందిస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకొని, రాగులను సాగు చేయాలని కోరారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రస్తుత అవసరాల రీత్యా రాగి సాగును పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రైతు శ్రమకు తగిన గిట్టుబాటు ధరను కల్పించి, పూర్తి సహకారాన్ని అందించినప్పుడే రాగుల సాగు పెరుగుతుందని సూచించారు. ఆ దిశగా అధికారులు యోచన చేసి, రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ విషయంలో వ్యవసాయాధికారులదే కీలక పాత్ర అని అన్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎటువంటి సమస్యా ఉత్పన్నం కాకుండా, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

జులై నుంచి గోధుమపిండి పంపిణీ

జులై నుంచి రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.16 చొప్పున ఫోర్టిఫైడ్ చెక్కి గోధుమపిండిని రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేయనున్నట్లు మంత్రి నాగేశ్వర్రావు తెలిపారు. ప్రతీ ధాన్యం మిల్లులో తప్పనిసరిగా డ్రయ్యరు, సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీనివల్ల రాష్ట్రస్థాయి నుంచే మిల్లులపై పర్యవేక్షణ చేయవచ్చని అన్నారు. వచ్చే సీజనులో మూడు లేదా నాలుగు రోజుల్లోనే ధాన్యం డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజనులు పండించే చిరుధాన్యాలను సంతల్లో కూడా సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కందిపప్పు లభ్యత అంతగా లేదని, ఆగస్టు నుంచి దీనిని సరఫరా చేస్తామని మంత్రి ప్రకటించారు. ఎక్కడైనా రేషన్ సరుకులకు అధిక ధరలు వసూలు చేసినా, ఎండియు వాహనదారులు అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గోధుమ పిండి పంపిణీని మంత్రులిద్దరూ ఈ సందర్భంగా లాంఛనంగా ప్రారంభించారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ ఎండి వీరపాండ్యన్, విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్, శ్రీకాకుళం, అనకాపల్లి జెసిలు నవీన్‌కుమార్, జాన్వీ పాల్గొన్నారు.

సిఎం సభ ఏర్పాట్లపై బొత్స సమీక్ష

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి కురుపాం పర్యటన ఏర్పాట్ల పరిశీల నిమిత్తం మంగళవారం కురుపాం విచ్చేసిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను మొదటగా పరిశీలించి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకుని కళాశాల నిర్మాణ నమూనాలు పరిశీలించి అనంతరం సిఎం సభ వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు మొట్టమొదటి సారిగా ముఖ్యమంత్రిగా వచ్చి జగనన్న అమ్మఒడి కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తల్లి బాగుంటే పిల్లలు బాగుంటారని, పిల్లలు చదవాలంటే తల్లికి కొంత ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి ఆశయం గొప్పదని అన్నారు. జగనన్న అమ్మఒడి కార్యక్రమం కింద ఆర్థిక సహాయం అందించడం పిల్లల చదువుకు భరోసా ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. సభా ఏర్పాట్లపై కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్, ఎమ్మెల్సీలు తలశీల రఘురాం, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు పాముల పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, టిడ్కో చైర్మన్ జమ్మానప్రసన్న కుమార్, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



అధికారులతో సభా ఏర్పాట్లను సమీక్షిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సిఎం పర్యటన సాగేదిలా...

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కురుపాం పర్యటనలో భాగంగా ఈనెల 28న ఉదయం 9.25 నిమిషాలకు విశాఖ ఎయిర్‌పోర్టు నుండి బయలుదేరి 10గంటలకు చినమేరంగి పాలిటెక్నిక్ మైదానానికి హెలీకాప్టర్‌లో చేరుకుంటున్నారు. అనంతరం సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తారు. 10.30గంటలకు బహిరంగసభా ప్రాంగణానికి చేరుకుంటారు. 10.35 గంటల నుంచి 12.15వరకు బహిరంగసభ జరుగుతుంది. మధ్యాహ్నం 12.25 గంటల నుంచి 12.55 వరకు స్థానిక నాయకులతో చర్చిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1గంటకు బయలుదేరుతారు.

'నారాయణ'పై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రభుత్వ నిబంధనలు గాలికి వదిలి యథేచ్ఛగా, విచ్చలవిడిగా ఫీజులు పెంచుకుంటూ నిర్వహిస్తున్న నారాయణ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక నారాయణ పాఠశాలను ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ సందర్శించి విద్యార్థుల ఫీజుల వివరాలపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ మాట్లాడుతూ నారాయణ పాఠశాలలో ఫీజుల దోపిడీ ఎక్కువగా ఉందని 1 నుంచి 5వ తరగతి వరకు రూ.30వేలు, ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు రూ.50వేలు వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రత్యేక తరగతుల పేర్లతో అదనంగా మరికొంత వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలు, యూనిఫాం, బూట్లు కూడా పాఠశాలలోనే కొనాలనే నిబంధనతో వేలకు వేలు దోచుకుంటున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. పుస్తకాలు అమ్మరాదని, 20శాతం పేద విద్యార్థులకు ఎటువంటి ఫీజులు కట్టించుకోకుండా ఉచిత విద్యను అందించాలనే నిబంధనలున్నప్పటికీ నారాయణ పాఠశాలలో ఏవీ అమలులో లేవని తెలిపారు. కావున, వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఈవిద్యాసంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సింహాచలం, కె.భాస్కర్, నవీన్, వంశీ పాల్గొన్నారు.



నారాయణ స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆధిపత్యం కోసం ఆరాటం

- ఉక్కిరిబిక్కిరవుతున్న అధికార యంత్రాంగం
- మంత్రి సహా ఎమ్మెల్యేలకూ ఎదురీత
- ఇదే పరిస్థితి కొనసాగితే అధికార పార్టీకి అంతే సంగతులు

ప్రజాశక్తి - సాలూరు

మొన్నటివరకూ ఆమె గిరిజన సంక్షేమ శాఖ మంత్రి. ఇప్పుడు మాజీ మంత్రి. మన్యం జిల్లా లో ఓ గిరిజన నియోజకవర్గానికి చెందిన మహిళా ఎమ్మెల్యే. ఉమ్మడి విజయనగరం జిల్లాలో మంత్రిగా, డిప్యూటీ సిఎంగా ఉన్నప్పుడు ఆమె పరిమితస్థాయిలో ఆధిపత్యాన్ని చెలాయించారు. అప్పుడు సీనియర్ మంత్రి గా బొత్స సత్యనారాయణ వున్న సమయంలో ఆమె పేరుకే మంత్రి అన్న చందంగా వ్యవహరించారు. కానీ ఇప్పుడు మాజీ మంత్రి హోదాలో అడుగడుగునా ఆధిపత్యం కోసం చక్రం తిప్పుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ఉన్న పలుకుబడిని ఉపయోగించి తన వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకునే ప్రయత్నం లో వున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రెండో విడత మంత్రివర్గ విస్తరణలో ఛాన్స్ దక్కించుకున్న గిరిజన సంక్షేమ మంత్రి, డిప్యూటీ సిఎం రాజన్నదొర ఇప్పుడు నామ్ కే వాస్తే మంత్రిగా కనిపిస్తున్నారు. మన్యం జిల్లాకు బాస్‌గా మంత్రి రాజన్నదొర నే జిల్లా యంత్రాంగం పరిగణించాల్సి వుంది. కానీ ఆ మాజీ మంత్రి మన్యం జిల్లా కే తానే బాస్ ననే ధోరణిలో ఉన్నారన్న విమర్శలు ఆ పార్టీ నుంచి వినిపిస్తున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సైతం పక్కనపెట్టి తన ఆధిపత్యాన్ని రుజువు చేసుకునే ప్రయత్నం ఉన్నారన్న చర్చ సాగుతోంది. తన సొంత నియోజకవర్గంలో వ్యతిరేకత పుష్కలంగా వున్నా జిల్లా యంత్రాంగంపై పట్టు కోసం పావులు కదుపుతున్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి వద్ద ఉన్న పలుకుబడి దృష్టి లో పెట్టుకొని ఆమె సిఫార్సులకే జిల్లా అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం చర్చ నీయాంశమవుతోంది. మంత్రిగా, డిప్యూటీ సీఎం గా వున్నప్పటికీ తన సిఫార్సులను జిల్లా యంత్రాంగం పట్టించుకోనప్పటికీ రాజన్నదొర అవమానభారాన్ని భరిస్తూ వస్తున్నారు. మంత్రి హోదాలో కంటే ఎమ్మెల్యే హోదాలో వున్నప్పుడే ఆయన సిఫార్సు లు చెల్లుబాటు అయ్యే పరిస్థితి వుండేదని ఆయన అనుచరులు అంటున్నారు.

గిరిజన సంక్షేమ డిడి నియామకంలో పీటముడి

పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు కి సంబంధించిన కీలక పోస్టు గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ నియామకంలో ఇటీవల మాజీ మంత్రి తన ఆధిపత్యాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నే బుట్టదాఖలా చేయించారు. కొద్దిరోజుల క్రితం వరకు ఇక్కడ పని చేసిన గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ బి.సూర్యనారాయణను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐటిడిఎ పరిధిలో ఉన్న సీనియర్ ఎటిడబ్ల్యుఓ నే గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ గా నియమించాలని జీవో లో స్పష్టం గా వుంది. అయితే ఆ మార్గదర్శకాలను పక్కనపెట్టి మాజీమంత్రి తన పలుకుబడితో తాను కోరుకున్న అధికారిని డిప్యూటీ డైరెక్టర్ గా నియమించుకునేలా ఉత్తర్వులు జారీ చేయించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సీనియర్ ఎటిడబ్ల్యుఒను డిడి గా నియమించాలని జీవో లో వుంటే జూనియర్ ఎటిడబ్ల్యుఒను నియమిస్తూఉత్తర్వులు తీసుకురావడంపై గిరిజన సంఘాలు భగ్గుమన్నాయి. సీనియర్ ఎటిడబ్ల్యుఒగా వున్న గిరిజన అధికారిని డిప్యూటీ డైరెక్టర్ గా నియమించకుండా ఆమె అడ్డుపుల్ల వేశారు. దీంతో ఖంగుతిన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం డిడి నియామకం జరగాలని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండేను ఆదేశించారు. రాజన్నదొర ఆదేశాల మేరకు సీనియర్ ఎటిడబ్ల్యుఒనే డిప్యూటీ డైరెక్టర్ గా నియమిస్తూ కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేయాల్సిన ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ ఇంకా అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారు. సిఎం పర్యటనరె సాకుగా చూపి డిడి నియామకం ఉత్తర్వులు జారీ చేయకుండా ఐటిడిఎ జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొద్దినెలల క్రితం కూడా డిడి నియామకం విషయం లో మాజీ మంత్రి తన మార్కు అధికారం చూపించారు. గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ గా గిరిజన అధికారినే నియమించాలని గిరిజన సంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేశాయి. తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న డిడి కిరణ్ కుమార్‌ను మళ్ళీ కొనసాగించాలని ఆమె తీవ్రంగా ప్రయత్నించారు. ఉపాధ్యాయ, గిరిజన సంఘాలు పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగొచ్చి డిడి కిరణ్ కుమార్‌ను తప్పించింది. ఇప్పుడు కూడా డిడి నియామకం విషయం లో ఆమె తన సూపర్ పవర్ ఉపయోగించి తన మాట చెల్లుబాటు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

మన్యం జిల్లా లో మూడు నియోజకవర్గాలు ఎస్‌టిలకు రిజర్వ్ చేయబడ్డాయి. గత రెండు దఫాలుగా జరిగిన ఎన్నికల్లోనూ వైసిపికే గిరిజనులు పట్టం కట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో గిరిజన మంత్రి, గిరిజన అధికారులపై అణిచివేత ధోరణి వల్ల తప్పుడు సంకేతాలు వెలువడుతున్నాయి.

ఏనుగుల దాడిలో 3500 ఎకరాల్లో పంట నష్టం

ఎలిఫెంట్ మానిటరింగ్ ఫారెస్ట్ రేంజర్ కె.మణికంఠేష్

ప్రజాశక్తి - కురుపాం

ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతంలో ఇప్పటి వరకు 3500 ఎకరాల పంట నష్టం జరిగిందని, పంట నష్టం జరిగిన రైతులకు రూ.2 కోట్ల 8 లక్షలు అందజేశామని ఎలిఫెంట్ మానిటరింగ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.మణికంఠేష్ అన్నారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2017 నుంచి భామిని మండలంలో 4 ఏనుగుల గుంపు, 2018లో కురుపాం నియోజకవర్గంలో 10 ఏనుగుల గుంపు తిరుగుతున్నాయని ఇంతవరకు 10 మంది ఏనుగుల బారినపడి మృతి చెందారని తెలిపారు. వీరి కుటుంబ సభ్యులకు రూ.2,50,000 చెక్కు, మరో రూ.2,50,000 కుటుంబ సభ్యుల పేరున డిపాజిట్ చేశామన్నారు. మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ.5లక్షలు చొప్పున నష్టపరిహారం అందజేశారు. ఇంకా పంట నష్టం రూ.28 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. కురుపాం నియోజకవర్గంలో 15 మంది, భామిని మండలంలో ఏడుగురు సిబ్బందితో ఏనుగుల కదలికలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ అప్రమత్తం చేస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని అన్నారు.

కలప అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు

కలప అక్రమ రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజర్ అధికారి పి.ఏడుకొండలు అన్నారు. మంగళవారం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అటవీ శాఖ అభివృద్ధికి వచ్చిన నిధులతో ప్రత్యేకంగా చెట్లు పెంచడానికి కృషి చేస్తూ పర్యావరణాన్ని పరిరక్షిస్తామన్నారు. అటవీ ప్రాంతంలో చెట్లు ఎక్కువ పెంచి ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు అర్హులందరికీ అందజేశామన్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు కలప అక్రమ రవాణా అనేది జరగడంలేదని, ఎవరైనా అడవిలో కలప నరికి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

29న విద్యా సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై ఫ్యాప్టో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఈనెల 29న విజయనగరంలో ఉదయం 9:30 గంటలకు స్థానిక ఎన్జీవో హోమ్‌లో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి.మహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథి గా, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ విశిష్ట అతిథిగా, ఎపిటిఎఫ్ 257 రాష్ట్ర అధ్యక్షులు భానుమూర్తి ప్రత్యేక అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఉపాధ్యాయ ఉద్యోగులందరూ ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సదస్సులో ఉపాధ్యాయ సమస్యలపై చర్చ, భవిష్యత్తు పోరాటాలపై కార్యాచరణ ప్రణాళిక ఉంటుందని తెలిపారు.

మన్యం వాసుల సమస్యలు పరిష్కరించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వేణు

ప్రజాశక్తి - కలెక్టరేట్

మన్యం ప్రజల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ముఖ్యమంత్రిని కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో జిల్లా ప్రజానీకానికి మీరిచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. జిల్లాలో ప్రధాన సమస్యలైన గిరిజన గ్రామాలకు లింక్ రోడ్లు ఏర్పాటు, పూర్ణపాడు లాభేసు వంతెన నిర్మించాలని, లక్ష్మయ్యపేట ఎన్సీస్ షుగర్ ఫ్యాక్టరీ, జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీలు తెరిపించాలని కోరారు. అలాగే అటవీ ఉత్పత్తులతో గృహ పరిశ్రమలు నిర్మించాలి, జీడి, పైనాపిల్, అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించాలని, జిల్లాలో గిరిజన యూనివర్సిటీ, పిజి సెంటర్, సాలూరు, పాలకొండలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు నిర్మించాలని, పార్వతీపురంలో మెడికల్ కాలేజీతో పాటు కురుపాం, సీతంపేట, సాలూరులో సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వాసుపత్రులు నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే జంఝావతి, అడారు గెడ్డ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, గుమ్మిడి గెడ్డ తదితర గెడ్డలపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్ని సదుపాయాలతో హాస్టళ్ల నిర్మించాలని, గిరిజన ఉత్పత్తులు, కూరగాయలు, టమోటా తదితర వ్యవసాయోత్పత్తులకు కోల్డ్ స్టోరేజిలు నిర్మించాలని డిమాండ్ చేశారు. బోయ వాల్మీకిలను ఎస్టీజాబితాలో చేర్చే అసెంబ్లీ తీర్మానాన్ని ఉపసంహరించాలని, జిఒ 3 రద్దును ఉపసంహరించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్/ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని, జిల్లాలో 185 మంది సవర భాషా వాలంటీర్లు నియామించాలని కోరారు. అలాగే ఆస్తి, ప్రాణ నష్టం చేసే ఏనుగుల గుంపును అడవికైనా, జూకైనా తరలించాలి పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, బంటు దాసు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు



బంగారు పతకాలు సాధించిన వేదాంత కాలేజ్ విద్యార్థులు

తైక్వాండోలో వేదాంత విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు తైక్వాండో జిల్లాస్థాయి పోటీల్లో గోల్డ్ మెడలు, సిల్వర్ పతకాలు సాధించారని కళాశాల చీఫ్ మెంటర్ పి.అప్పారావు, ఎస్ఎల్ నాయుడు తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ సోమవారం విజయనగరంలో జిల్లాస్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు జి.అభిషేక్, సిహెచ్ అనిల్‌కుమార్, ఆర్.అభిషేక్ పాల్గొన్నారు. వీరు జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్‌తో పాటు సిల్వర్ మెడల్ కూడా సాధించారన్నారు. వీటితో పాటు తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీలు జరగబోతున్నాయని అందులో కూడా విజయం సాధించి తమ కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను అభినందించారు. తమ విద్యార్థులకు కె. అనిల్ శర్మ కోచ్ ఇవ్వడం ద్వారా పతకాలు సాధించారన్నారు. అందుకు కోచ్ అనిల్ కుమార్‌కు, మెడల్ సాధించిన విద్యార్థులకు వేదాంత కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యకు ఇస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుకోవాలని విజయనగరం రూరల్ సిఐ టి.తిరుపతిరావు సూచించారు. భద్రగిరి ఎపి టి డబ్ల్యు ఆర్ ఎస్ గురుకుల కళాశాల విద్యార్థులతో మంగళవారం మమేకమయ్యారు. నేటి సమాజంలో విద్యకు ఉన్న ప్రాధాన్యత వివరించి తల్లిదండ్రుల కష్టాలు గుర్తించి వారి కలలు నెరవేర్చాలన్నారు. విద్యతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి కనబరచాలన్నారు. అనంతరం విద్యార్థులకు యోగా చేయించి ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ యుగంధర్ ఉన్నారు.



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద హెలీప్యాడ్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఎర్రన్న గుడి జంక్షన్ సమీపంలో అధికారులు రెండో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. కురుపాంలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో చినమేరంగి పాలిటెక్నికల్ కళాశాలలో హెలికాప్టర్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిగేందుకు వీలుగా హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. అయితే ఏమాత్రం వాతావరణం అనుకూలించనిచో ఎర్రన్నగుడి వద్ద దిగేందుకు వీలుగా హెలీప్యాడ్‌ను సిద్ధం చేశామని అధికారులు అంటున్నారు. హెలిప్యాడ్ వద్ద ఉల్లిభద్ర గ్రామపంచాయతీ కార్యదర్శి ఉప్పల పెదకోటేశ్వరరావు తోపాటు వీఆర్వో జోజిని ఇన్చార్జిగా నియమించారు.



విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేస్తున్న హెచ్ఎం సుబ్బారావు

జగనన్న విద్యాకానుకను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

జగనన్న విద్యా కానుకను వినియోగించుకోవాలని ప్రధానోపాధ్యాయులు కొండ గొర్రె సుబ్బారావు అన్నారు. మండలంలోని దోనుబాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. దీనికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. జగనన్న విద్యా కానుక కిట్లు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు డిప్యూటీ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.



బిల్లుమడ గిరిజనులతో టిడిపి నాయకులు జయకృష్ణ

'భవిష్యత్తు కావాలంటే టిడిపి రావాలి'

ప్రజాశక్తి - భామిని

రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక అభివృద్ధి జరగాలంటే టిడిపి హయాంలో చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని పాలకొండ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని బిల్లుమడ, సతివాడలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోపై వివరణ ఇచ్చి, రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా టిడిపిని గెలిపించుకోవాలని, లేని పక్షంలో భవిష్యత్తు అంధకారం అవుతుంది అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, నాయకులు భూపతి ఆనందరావు, బిడ్డికి ప్రసాద్, కోరాడ రాజేష్, భామిని సర్పంచ్ లోపింటి రాజేష్, స్థానిక టిడిపి కార్యకర్తలు ఉన్నారు.

కూలేందుకు సిద్ధంగా కర్లెమ్మ వంతెన

ప్రజా శక్తి -భామిని

మండలంలోని కర్లెమ్మ సమీపంలోని పెద్దదిమిలి, కొత్తూరు మధ్య ప్రధాన రహదారిలో బగ్గమర్రిపాడుగెడ్డపై వాహనాల రాకపోకలకు వేసిన వంతెన పైభాగం కొంత విరగడంతో కూలాడానికి సిద్ధంగా ఉంది. మరమ్మతులు చేయకుండా పెద్ద వాహనాలు, లారీలు ఈ వంతెన మీదుగా వెళ్తే కూలిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సత్వరమే స్పందించి భారీ వాహనాల రాకపోకలు నిషేధించి, తక్షణమే వంతెన మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



బీటలు వారిన ప్రాంతంలో మొక్కను పాతిన గ్రామస్తులు

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలివ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రీన్ అంబాసిడర్లకు ఏడాదిగా బకాయి ఉన్న జీతాలు వెంటనే చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎపి గిరిజన సంఘం కార్యాలయంలో మంగళవారం సిఐటియు నాయకులు, గ్రీన్ అంబాసిడర్లతో సమావేశమయ్యారు. ప్రతిరోజు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచుతున్న గ్రీన్‌అంబాసిడర్ల కష్టాలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా పెరుగుతున్న ధరలతో ఎలా బతకాలని ప్రశ్నించారు. గ్రీన్ అంబాసిడర్ల పట్ల ప్రభుత్వం చిన్న చూపు తగదన్నారు. గ్రీన్‌అంబాసిడర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అమ్మఒడి కార్యక్రమ ప్రారంభానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కురుపాం వస్తున్న సందర్భంగా గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, జిల్లా నాయకులు కోలక అవినాష్, ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, నాయకులు పాండురంగారావు, గ్రీన్ అంబాసిడర్లు మాధవ, భూషణ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు

జిల్లా కేంద్ర సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం జిల్లా కేంద్రం సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు విజ్ఞప్తి చేశారు. పట్టణం మౌలిక వసతులలేమితో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులతో అల్లాడుతున్న ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు పట్టణానికి తక్షణమే బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని, పట్టణ ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా సమగ్ర మంచినీటి పథకాన్ని పూర్తి చేయాలని, పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, రైల్వే గేటు సమస్యకు పరిష్కారంగా బెలగాం లో అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని, జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న పంచాయతీల శాశ్వత అభివృద్ధికి దోహదపడేలా ఇప్పటికే రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను అమలు చేసి అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

2న ఎల్‌టిపిల జనరల్ బాడీ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ జనరల్ సమావేశం జులై 2న జరుగుతుందని రాష్ట్ర ఇసి మెంబర్ పిన్నింటి జయకృష్ణ మంగళవారం తెలిపారు. రాష్ట్ర ఎల్‌టిపి అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో కూడిన ఈ సమావేశం నరసరావుపేటలోని వివిఆర్ గ్రాండ్ హోటల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కావున ఈ సమావేశానికి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఎల్‌టిపిలు, లైసెన్స్ ఇంజనీర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



పాఠశాల కావాలంటూ కోరుతున్న విద్యార్థులు

జగన్ మామా.. బడి కావాలి

డుమ్మంగి విద్యార్థుల వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సిఎం జగన్ మామయ్య మా గ్రామానికి స్కూల్ కావాలంటూ మండలంలోని డుమ్మంగి గ్రామ విద్యార్థులు కోరారు. మా గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణతో వారి స్థానంలో నేటి వరకు ఉపాధ్యాయులను నియమించలేదు. ఎయిడెడ్ పాఠశాలల నిర్వాహకులు 15 ఏళ్ల కిందట ప్రభుత్వానికి అప్పగించారు. పాఠశాల ప్రభుత్వ పరమైనప్పటికీ నేటికీ ఉపాధ్యాయుల నియామకం లేదు. దీంతో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో బయట ప్రాంతానికి వెళ్లి చదువుకుంటున్నాం. మా కష్టాన్ని గుర్తించి గ్రామంలో ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి. గ్రామ సర్పంచి పాలక క్రాంతి కుమార్ మాట్లాడుతూ తమ గ్రామంలో గల పాఠశాలకు ఉపాధ్యాయుడ్ని నియమించి విద్యార్థుల కష్టాలు తీర్చాలని ఆయన కోరారు.

ఆదర్శంగా ప్రభుత్వ విద్యా పథకాలు

ప్రజాశక్తి-పార్వతీ పురం రూరల్

రాష్ట్రంలో అమలు అవుతున్న విద్యా పథకాలు ఇతరరాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు ఎన్‌వి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల కోసం అమలవుతున్న నాడు-నేడు, అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, వసతిదీవెన, విద్యాదీవెన, ఆణిముత్యాలు, గోరుముద్ద వంటి కార్యక్రమాలు ఏ రాష్ట్రంలోనూ అమలు కావడంలేదన్నారు. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకొని పిల్ల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ముందుగా, ప్రధానోపాధ్యాయులు వి.గౌరి, ఉపాధ్యాయులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులను రోజూ పాఠశాలకు పంపించాలి

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులను తల్లిదండ్రులు బాధ్యతతో ప్రతిరోజూ పాఠశాలకు పంపించాలని చింతలగూడ ఎయిడెడ్ పాఠశాల మేనేజర్ బేత కృష్ణ మూర్తి నాయుడు కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు పుస్తకాలు, బ్యాగులు, బూట్లు అందిస్తుందని తెలిపారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.. సమావేశంలో ఉపాధ్యాయులు బి.కుమార్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు లక్ష్మణరావు

వీరఘట్టం : మొట్టమొదటిగా తల్లిదండ్రులే పిల్లలను క్రమశిక్షణలో పెట్టాలని ప్రధానోపాధ్యాయులు ఎస్.సుంబోరా తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమం పథకాలు ప్రవేశపెడుతుందని, పథకాల అమూల్యమైనవన్నారు. పిల్లల భవిష్యత్తు ఉపయోగకరమైందని, తల్లిదండ్రులే మొదటి గురువులని, బాగా చదువుతున్నారా లేదా తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బందితోపాటు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి వైసిపి నాయకులు ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని టిడిపి మండల అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు డిమాండ్ చేశారు. బుధవారం కురుపాంలో జరగనున్న బహిరంగ సభకు ముఖ్యమంత్రి వస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి పుష్పశ్రీవాణి ద్వారా ముఖ్యమంత్రికి నివేదించి పరిష్కారానికి ప్రయత్నించాల్సిందిగా కోరారు. జంఝావతి కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు వచ్చేలా కాలువలు ఆధునీకరణ చేయాలన్నారు. తోటపల్లి అదనపు ఆయకట్టుకు మూడు ఎత్తిపోతల పథకాలు రూ.54 కోట్లతో 164 రద్దుచేసిన జీవోను పునరుద్ధరించి వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. తోటపల్లి పాత కుడి, ఎడమ కాలువల ఆధునీకరణ పనులు వెంటనే పూర్తి చేసి శివారు భూములకు సాగు నీరందించాలన్నారు. మండలంలో గత ప్రభుత్వంలో నాబార్డ్, ప్రపంచ బ్యాంకు నిధులతో మంజూరై ఈ ప్రభుత్వంలో రద్దయిన రోడ్ల పనులకు వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని మధుసూదనరావు కోరారు.

డ్వాక్రా నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గంగమ్మ ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పరిధిలోని బంగారమ్మపేటలో డ్వాక్రా సంఘాలకు సంబంధించిన నిధులు దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముగడ గంగమ్మ ఆధ్వర్యాన మహిళలు ధర్నా నిర్వహించారు. మంగళవారం ఆమె స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళలతో కలిసి బైఠాయించారు. 25వ వార్డులో స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన నిధుల లెక్కలు చెప్పాలని కోరుతుంటే రిసోర్స్ పర్సన్ సింగారపు పద్మ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మున్సిపల్ అధికారులు కూడా పక్షపాత ధోరణి అవలంభిస్తున్నారని ఆరోపించారు. డ్వాక్రా నిధులు గోల్‌మాల్ జరిగినట్లు ఆధారాలు ఉన్నాయని చెప్పారు. కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు భార్య పద్మ ఆర్పీగా ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గంగమ్మ చెప్పారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించిన మాజీ చైర్‌పర్సన్ గంగమ్మ

పచ్చిరొట్ట సాగుతో భూసారం : ఎఒ

ప్రజాశక్తి - పాచిపెంట

భూసారం మెరుగుపడాలంటే ఏకైక పరిష్కారం పచ్చిరొట్ట నవధాన్యాల సాగు అని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చినచీపురుపల్లి, చెరుకుపల్లిలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులంతా తప్పనిసరిగా పచ్చిరొట్ట, నవధాన్యాలు సాగు చేసి భూమిలో కలియదున్నాలని తెలిపారు. భూమిలో సేంద్రీయ కర్బనం 0.1శాతం మాత్రమే ఉందని, రాబోయే రోజుల్లో ఇది మరింతగా తగ్గిపోయి పంట పొలాల సాగుకు పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని అన్నారు. కావున రైతులు పచ్చిరొట్ట, నవధాన్యం విత్తనాలు చల్లి పూత దశలో కలియ దున్నడం ద్వారా నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం ద్వారా భూమిని సారవంతం చేయొచ్చని అన్నారు. పచ్చిరొట్ట, నవధాన్యాల వల్ల పంటలకు కావాల్సిన సూక్ష్మ, స్థూల పోషకాలన్నీ లభిస్తాయని, భూమిలో జీవ వైవిధ్యాన్ని పెంచుతాయని, వాన పాములు, ఇతర భూసారాన్ని పెంచే జీవుల వృద్ధి జరుగుతుందని తెలిపారు. అలాగే రసాయన ఎరువులకు పంటల ప్రతిస్పందన బాగుంటుందని, భూమిలో సూక్ష్మ పోషకాల లభ్యత పెరిగి పంటల్లో జింకు, ఇనుము లోపాలు సవరించబడతాయని తెలిపారు. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, క్రమంగా సాగు చేసిన పొలాల్లో కలుపు ఉధృతి తగ్గుతుందని, పంట లేని కాలంలో భూమిని కప్పి ఉంచడం ద్వారా నేలలోనిసేంద్రియ పదార్థ నష్టాన్ని నివారించవచ్చునని చెప్పారు. రసాయన ఎరువులపై ఖర్చులు తగ్గించవచ్చని, ఉపయోగకర కీటకాలు సంఖ్య పెరగడం వల్ల చీడ పీడల ఉధృతి తగ్గుతుందని పేర్కొన్నారు. అనంతరం రైతులకు ఉచితంగా కంది, చోడి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విఎఎలు వినోద్, నాగమణి, ఐసిఆర్‌పి సురేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



పచ్చిరొట్ట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

విత్తనశుద్ధితో తెగుళ్లు నివారణ

సీతానగరం : విత్తన శుద్ధి వల్ల విత్తనం, నేల ద్వారా వ్యాపించే తెగుళ్లు, పురుగులను సమర్థవంతంగా నివారించడానికి దోహదపడుతుందని మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ అన్నారు. మేలైన వ్యవసాయ పద్ధతులు (జిఎపి) పొలంబడిలో భాగంగా ఆర్.వెంకంపేటలో విత్తన శుద్ధి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తశుద్ధికి వినియోగించే మందులు విత్తనంలోకి చొచ్చుకొనిపోయి శిలీంద్రాలను నాశనం చేస్తాయన్నారు. తక్కువ ఖర్చుతో పురుగులు, తెగుళ్లు పంటను ఆశించకుండా చేయవచ్చన్నారు. విత్తనం మొలక శాతం పెరగడానికి దోహదపడుతుదని రైతులకు వివరించారు. కార్యక్రమంలో విఎఎలు, ఎపిసిఎన్ఎఫ్ విభాగం, ఎంసిఆర్‌పి, ఎన్ఎఫ్ఎఫ్, రైతులు పాల్గొన్నారు.



పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

ఎన్ఆర్‌సిలో డిఐఒ తనిఖీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిలో గల ఎన్ఆర్‌సిని (పోషకాహార పునరావాస కేంద్రం) జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన బరువు తక్కువగా ఉన్న, పోషకాహార లోపం పిల్లల ఆరోగ్యాన్ని పరిశీలించారు. అలాగే వారి తల్లులతో మాట్లాడి అందుతున్న సేవలనుఅడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఈ విధంగా ఆరోగ్య స్థితిని పరిశీలించి సంబంధిత గ్రోత్ చార్ట్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. చిన్నారులకు అందజేస్తున్న పోషకాహార మెనూ, సిరప్‌లను పరిశీలించారు. ప్రతి నెలా అడ్మిట్ అవుతున్న పిల్లల ఆరోగ్య వివరాల రికార్డులను ఆయన పరిశీలించి, ఆరోగ్య స్థితి మెరుగుపడే వరకూ పక్కగా వైద్య సేవలందించాలన్నారు. ఆయన వెంట సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

హత్య కేసులో నిందితురాలికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్, కొత్తవలస

కొత్తవలస పోలీసు స్టేషన్ పరిధి తుమ్మికాపల్లిలో 2019లో జరిగిన హత్య ఘటనలో నిందితురాలు అడ్డూరి విజయలక్ష్మికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ విజయనగరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి బి.కళ్యాణ్ చక్రవర్తి మంగళవారం తీర్పు వెల్లడించారు. ఈమేరకు కొత్తవలస సిఐ ఎస్.బాల సూర్యారావు తెలిపారు. తుమ్మికాపల్లికి చెందిన అడ్డూరి విజయలక్ష్మి (35) తన భర్త అడ్డూరి దేవుడు తరచూ ఆమెను అనుమానించి, మానసికంగా వేధిస్తున్నాడని అతడిని హత్య చేసింది. ఈ విషయమై కొత్తవలస పోలీసు స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ మురళి కేసు నమోదు చేయగా, సిఐ జి.గోవిందరావు దర్యాప్తు చేపట్టి, నిందితురాలిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రాలను దాఖలు చేసారు. కోర్టు విచారణలో నిందితురాలు అడ్డూరి విజయలక్ష్మి పై నేరారోపణలు రుజువు కావడంతో నిందితురాలికి జీవిత ఖైదు, రూ.వెయ్యి రూపాయలు జరిమానా విధించారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని మున్సిపల్ జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు చెప్పారు. మంగళవారం ఆయన పట్టణంలోని నాలుగో వార్డు పెద్దవీధి లో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లతో అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలు అందని వారికి అందేలా చూడడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని గిరి రఘు కోరారు. కార్యక్రమంలో శ్యామలాంబ కోపరేటివ్ స్టోర్స్ వైస్ చైర్మన్ మోహన్ రావు, కౌన్సిలర్ పప్పల లక్ష్మణరావు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని దశమంతపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించి ఆన్లైన్లో పొందుపరుస్తున్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి కె.సునీల్‌కుమార్, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

కంబరవలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలసలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రోగులకు పలు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శాంతికుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

30న విజయవాడలో రైతు సంఘం మహాధర్నా

ప్రజాశక్తి - బలిజిపేట

రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం రైతు సంఘం నాయకులు పోస్టర్ విడుదల చేశారు. రైతు సంఘం మండల అధ్యక్షులు గంట్యాడ బలరామనాయుడు మాట్లాడుతూ రైతుల ప్రధాన సమస్యలపై తలపెట్టిన మహా ధర్నాలో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు ఆవు సాంబమూర్తి, నాయకులు వెంకటనాయుడు, బద్దన భానుమూర్తి, నల్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

ప్రజాశక్తి - సీతానగరం

డిప్యూటీ కమిషనర్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, విశాఖపట్నం ఆదేశాల ప్రకారం వివిధ కేసుల్లో నమోదైన పాత నేరాల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలు, కారును ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ వారి ఆధ్వర్యంలో ఈనెల 29న వేలం పాట నిర్వహించనున్నట్టు స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్, ఎస్ఐ ఎ.శ్రావణ్ కుమార్ తెలిపారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రజల శ్రేయస్సు కోసమే ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మంగళవారం మండలంలోని గదబవలసలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నెరవేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి ఆర్.దాలమ్మ- కష్ణ , సచివాల సిబ్బంది గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలకు గ్రామస్తులకు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి